# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 3 ఫిబ్రవరి – 2025 పేజీలు: 24
















## 'దివ్య'మైన లక్ష్యం..

# కస్తూరి తిలకం

### కేజీబీవీ స్టూడెంట్ టీచర్



విద్యావికసిత ఆంధ్రా మెరిసింది



సెపక్ తక్రా బాలికల విజేత ఆంధ్రప్రదేశ్




సైన్స్ ఫెయిర్ 2024-25..సూపర్




గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి శకటాల ప్రదర్శనలో భాగంగా పాఠశాల విద్యాశాఖ – సమగ్ర శిక్షా ప్రదర్శించిన **'మానవ వనరులు.. తరగని సిరులు'** శకటానికి ప్రథమ బహుమతి దక్కింది. గౌరవ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ గారి చేతుల మీదుగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ IAS., బహుమతి అందుకున్నారు.

**పాఠశాల విద్యాశాఖ – సమగ్ర శిక్షా శకటానికి ప్రథమ బహుమతి**



గౌరవ సలహాదారులు
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**డా. కృతికా శుక్లా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య
ఎడిటర్
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా
సలహాసభ్యులు
**వి.ఎన్.మస్తానయ్య,** డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD -1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD -2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, CMO
వర్కింగ్ ఎడిటర్
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
సబ్ ఎడిటర్
**గణేశ్ బెహరా,** PRO
ఎడిటోరియల్ కమిటీ
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంఓ)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. ఎ.సుహాసిని,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వేంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
డిజైనింగ్
**గిరిధర్ అరసవల్లి**
డీటీపీ & సహకారం
**కె.అభిషేక్**
చిత్రకారులు
**మల్లిక్ & లక్ష్మణ్**

# మన బడి
## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 3 ఫిబ్రవరి– 2025 పేజీలు: 24

## శిక్షణతో నాయకత్వ లక్షణాలు

*"I fear not the man who has practiced 10,000 kicks once,*
*but I fear the man who has practiced one kick 10,000 times." - Bruce Lee*

విద్యకైనా, ఆత్మరక్షణ విద్యకైనా శిక్షణ, కఠోర సాధన ఎంత అత్యవసరమో బ్రూస్‌లీ కొటేషన్ వివరిస్తుంది. శిక్షణ ద్వారా ప్రధానోపాధ్యాయుడి నుంచి ఉపాధ్యాయుడికి, ఉపాధ్యాయుడి నుంచి విద్యార్థికి సమకాలీన విద్య, విజ్ఞానం బదిలీ అవుతాయి.

మన పాఠశాల నాయకులకు నాయకత్వ లక్షణాలు, జీవననైపుణ్యాలు తప్పనిసరి.

*"Leadership and learning are indispensable*
*to each other." - John F. Kennedy*

నాయకత్వం మరియు అభ్యసనం పరస్పరం అనివార్యమైనవి అంటారు జాన్ ఎఫ్ కెన్నెడీ

గొప్ప నాయకత్వ లక్షణాలను కలిగిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు అభ్యసనం తోడైతే విద్యార్థులను జ్ఞానసంపదగా తీర్చిదిద్దే శక్తిగా తయారవుతారనే లక్ష్యంతో నాయకత్వ లక్షణాల శిక్షణను ఒక యజ్ఞంలా కొనసాగిస్తున్నాం.

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో, సీమ్యాట్ పర్యవేక్షణలో 'లీడర్‌షిప్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్' లో భాగంగా ప్రధానోపాధ్యాయులకు 12 సామర్థ్యాలపై శిక్షణ ఇవ్వడం పూర్తయింది. రెండు దశల్లో 26000 మందికి శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రభుత్వ విద్యాలయాలకు సమర్థ నాయకత్వాన్ని అందించామనే సంతృప్తి ఉంది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగమైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు.

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/ samagrashiksha/ మరియు cse.ap.gov.in

# 'గురు'తర బాధ్యత.. నాయకత్వ శిక్షణ

## సీమ్యాట్ పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయులకు రెసిడెన్షియల్ ట్రైనింగ్

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ప్రతి విద్యార్థికి గుణాత్మక విద్యను అందించేందుకు ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణను ఏర్పాటు చేశారు స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్(సీమ్యాట్) పర్యవేక్షణలో లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రధానోపాధ్యాయులకు 12 సామర్థ్యాలపై శిక్షణ ఇస్తున్నారు.

ప్రధానోపాధ్యాయులకు 'లీడర్‌షిప్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్' లో భాగంగా స్వీయ అవగాహన, స్వీయ నిర్వహణ, కమ్యూనికేషన్, ప్రభావాన్ని చూపడం, కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్(సంఘర్షణ. నిర్వహణ సామర్థ్యం) అబ్జర్వేషన్ అండ్ ఫీడ్ బ్యాక్ (పరిశీలనా సామర్థ్యం) అంశాలపై ఇంటరాక్టివ్, సెల్ఫ్ రిఫ్లక్షన్ మోడ్ (పరస్పర వ్యక్తిగత సమీక్షా విధానాలు),పీర్ లెర్నింగ్ (సమవయస్కులతో అభ్యసన),ఎక్స్‌పీరియన్సెడ్ లెర్నింగ్ (అనుభవపూర్వక అభ్యసన) తదితర విధానాల ద్వారా శిక్షణనిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉదయం యోగా, ధ్యానం, సాయంత్రం సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలతో, చక్కని భోజన వసతి కల్పించారు. శిక్షణకు ముందు ప్రీ టెస్ట్, ట్రైనింగ్ అనంతరం పోస్ట్ టెస్ట్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. తొలుతగా ఉన్నత పాఠశాలలు, అనంతరం ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. 2023–24 విద్యా సంవత్సరంలో జూలై 18వ తేదీ నుంచి మొదటి దశలో 14000 మంది ప్రధానోపాధ్యాయులు, 2024–25 విద్యా సంవత్సరంలో రెండవ దశలో ప్రధానోపాధ్యాయులు 12000, 950 మంది మండల విద్యాశాఖాధికారులకు నాయకత్వ సామర్థ్యాల శిక్షణ విజయవంతంగా పూర్తి చేశారు. లీడర్‌షిప్ ట్రైనింగ్ రాష్ట్ర వ్యాప్తంగా 13 కేంద్రాలలో నిర్వహించి, బ్యాచ్‌కు 300 మందికి శిక్షణ ఇచ్చారు.













# ఉండవల్లి గుహలు చూశామోచ్...



నా పేరు పి. నాగ సింధు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వేమవరం పాఠశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాను. మా పంచాయతీలో గల పాఠశాలల విద్యార్థులమంతా కలిసి 'ఉండవల్లి గుహలు చూద్దాం రారండి' అంటూ విహార యాత్రకు వెళ్లాం. మా యాత్రానుభూతి మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

జనవరి 5 వ తేదీ. ఆదివారం. మర్నాడు ఆరు గంటలకే కుతూహలంతో బడికి చేరుకున్నాము. అప్పటికే మా విహారయాత్రకు వెళ్లాల్సిన బస్సు రెడీగా ఉంది. ఆ బస్సు ముందుభాగాన 'ఉండవల్లి గుహలు చూద్దాం రారండి' బ్యానర్ కట్టాము.



మా టీచర్లు, విద్యార్థులమంతా బస్సు ఎక్కాం. పక్క ఊరులో పాఠశాల పిల్లలు ఎక్కాక ఈలలు, గోలలు కేరింతలతో బస్సు ముందుకు సాగిపోతుంది.

బయలుదేరకముందే యాత్రకు కావాల్సిన వస్తువులు, ఆహార పదార్థాలు, వాటర్ క్యాన్లు బస్సులో పెట్టించేశారు మా మాస్టార్లు. అందరితో బస్సులో ప్రయాణిస్తుంటే కొంతమంది కిటికీల వెంబడి చూస్తున్నారు. ఇంకొంతమంది నిద్రపోతున్నారు. కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు. మరికొంతమంది స్నాక్స్ తింటున్నారు.

తెనాలి మీదుగా విజయవాడ దగ్గరకు చేరబోతున్నాం. తాడేపల్లి దాటగానే వారధిపై బస్సు వచ్చింది. కృష్ణా నది చూడటం అదే మొదటిసారి. చాలా పెద్ద నది. వారధి మీదుగా వెళ్తుంటే అంబేద్కర్ గారి విగ్రహం చాలా పెద్దగా కనిపించింది. కానీ మా టీచర్లు ప్లాన్ ప్రకారం మొదట భవానీ ఐలాండ్ కు వెళ్దాం అన్నారు. బెర్మ్ పార్క్ దగ్గరకు చేరుకుని, లాంచీ టికెట్లు తీసుకొని, లాంచీలో పది నిమిషాలు ప్రయాణం చేస్తున్నాం. అప్పటికే లాంచీలో చాలామంది ఉన్నారు. మేమంతా దాదాపు 50 మంది ఉంటాము. మేము అరుపులు, కేకలు వేస్తూంటే లాంచీలో ఉన్న పెద్దలు కూడా మాలాగానే చిన్నపిల్లలు అయిపోయారు కాసేపు. భవానీ ద్వీపానికి చేరుకోగానే లాంచీ ఎక్కేముందు, దిగేముందు విద్యార్థులంతా ఉన్నారో లేదో అని లెక్కపెట్టారు మా మాస్టారు.

భవానీ ద్వీపంలో అడుగుపెట్టగానే.. ముందుగా పెద్ద సింహం బొమ్మ వద్ద మేమంతా గ్రూప్ ఫోటో దిగాము. అక్కడ ఐలాండ్ గురించి మా సార్ వివరిస్తుంటే మేమంతా వింటూ గమనించాము. తర్వాత జారుడు బల్ల, నెట్ వాకింగ్ దగ్గరకెళ్లి ఆడుకున్నాం. తర్వాత చూసిన ట్రీ హౌస్ ఏదో ఒక వింత అనిపించింది. అక్కడ డ్రాగన్ ట్రైన్ ఎక్కి కొద్దిసేపు ఆడుకున్నాము. అప్పటికే మధ్యాహ్నం అయ్యింది. అక్కడే ఉన్న పచ్చిక (ల్యాన్)లో భోజనం ఏర్పాట్లు చేశారు. అందరం కలిసి సరదాగా భోంచేసాం. కాసేపు ఆడుకొని, లాంచీ ఎక్కాం. మళ్లీ మా సార్ అందరికీ హాజరు వేసి లెక్కపెట్టారు. లాంచ్‌లో నదిలో ప్రయాణం కొత్త అనుభూతిగా అనిపించింది.


బెర్మ్ పార్కులో మా బస్సు ఎక్కి విజయవాడలో అంబేద్కర్ విగ్రహం దగ్గరికి చేరుకున్నాం. అమ్మో ఎంత పెద్ద బొమ్మో! అంబేద్కర్ గారి గురించి మా సార్లు చెబుతుంటే, మాతో పాటు, అక్కడ వచ్చిన సందర్శకులు కూడా వినడం మాకు సంతోషం వేసింది.

అంబేద్కర్ గారి విగ్రహం కింద ఉన్న మ్యూజియం చూశాము. అక్కడ ఉన్న ప్రతి అంశం గురించి మా టీచర్లు వివరించారు. అప్పటికే సాయంత్రం నాలుగు గంటలైంది. అక్కడి నుండి ఉండవల్లి కోసం ప్రయాణం అయ్యాము. కొద్దిసేపట్లోనే ఉండవల్లి గుహలకు చేరుకున్నాం. ఉండవల్లి గుహలు చూసిన తర్వాత కొండలు ఇంత అద్భుతంగా చెక్కడం ఎలా సాధ్యమని మా టీచర్లను ప్రశ్నల మీద ప్రశ్నలు అడిగాం. టీచర్లు వివరణ ఎప్పటికీ మర్చిపోలేము. అక్కడ గుహలను చూసిన తర్వాత కిందకి వచ్చి స్నాక్స్ తిన్నాం. కొద్దిసేపు ఆడుకున్నాం. పిల్లలు హాజరు తీసుకొని అందరూ బస్సు ఎక్కాం. మా ఊరుకు తిరుగు ప్రయాణమయ్యాం.



'ఇల్లు వచ్చింది నిద్రలేవండి' అని మా సార్ లేపడంతో అందరం దిగేశాం. మా సార్లు, టీచర్లు ఎంతో జాగ్రత్తగా యాత్ర విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపాం. మరోసారి మరో కొత్త ప్రాంతానికి విహార యాత్రకు తీసుకెళ్తే బాగుంటుందని అనిపించింది. మా యాత్రానుభూతిని అమ్మానాన్నలకు చెప్పుకుని సంతోషించాను''.





# నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు

## విజయవంతంగా రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ 2024-25

వినూత్న ఆలోచనలకు కార్యరూపం.. ఉపయోగపడే ప్రయోగాలు.. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు అనేలా విజయవంతంగా సాగింది ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ 2024-25. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకి మురళి రిసార్ట్స్‌లో జరిగిన సైన్స్ ఫెయిర్ కు 26 జిల్లాల నుండి 156 మంది విద్యార్థులు, వారితో పాటు 156 మంది ఉపాధ్యాయులు మొత్తం 312 మంది పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల విజ్ఞానం, దూరదృష్టి, సృజన ప్రాజెక్టులలో ప్రస్ఫుటమైంది. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం, జీవశాస్త్రం, ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, పర్యావరణ శాస్త్రం వంటి విభాగాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఇండివిద్యువల్, గ్రూప్, టీచర్ ఎగ్జిబిట్ కేటగిరీలలో ప్రదర్శించారు.

సైన్స్ ఫెయిర్ ని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు వి.విజయ రామరాజు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ప్రాజెక్ట్ ను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ప్రాజెక్ట్ పై ప్రశ్నలు, దాని ఉపయోగం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆవిష్కరణల వెనుక ఉన్న శాస్త్రీయత, ఆలోచనా శక్తి, కృషిని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో మానవ వనరుల శాఖ మంత్రి ఓఎస్డీ ఆకుల రమణ, ఎస్సీఈఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.
















### తరగతి గదులు మినీ ల్యాబ్స్ కావాలి

రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ( సైన్స్ ఫెయిర్ ) ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమగ్రశిక్షా పథక రాష్ట్ర సంచాలకులు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వచ్చే ఏడాదినుంచి ఈ ప్రదర్శనను రాష్ట్రంలో ఎక్కువమంది విద్యార్థులు వీక్షించేలా నాలుగైదు రోజులు నిర్వహిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సైన్స్ నోడల్ అధికారి ఆర్.భాగ్యశ్రీ, కంకిపాడు, పెనమలూరు మండల విద్యాశాఖాధికారులు, ఎస్సీఈఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.



# సెపక్ తక్రా... బాలికలు భళా

## స్కూల్ గేమ్స్ అండర్ 14 జాతీయ సెపక్ తక్రా బాలికల ఛాంపియన్ ఆంధ్రప్రదేశ్

### బాలుర విభాగంలో మణిపూర్ టీమ్ విజేత

సెపక్ తక్రా నేషనల్ టోర్నమెంటులో మన బాలికలు తమ ఆటతీరుతో భళా అనిపించారు. అద్భుతమైన ప్రతిభతో విజయం సాధించారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్,ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ విజయవాడ పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలురు) లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్-14 జాతీయ సెపక్ తక్రా బాలురు, బాలికల పోటీలను సమగ్రశిక్షా పథక రాష్ట్ర సంచాలకులు బి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ టోర్నమెంటులో బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్, బాలుర విభాగంలో మణిపూర్ జట్లు విజేతగా నిలిచాయి. బాలికల ఫైనల్ పోటీలో ఆంధ్రప్రదేశ్ జట్టు మణిపూర్ జట్టుపై 15-13,17-15 పాయింట్స్ తేడాతో గెలిచి ఛాంపియన్ గా నిలిచింది. కావ్య అద్భుత ఆటతీరుతో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించింది. మూడవ స్థానం బీహార్ కి దక్కింది. బాలురు విభాగంలో జరిగిన ఫైనల్ లో మణిపూర్ జట్టు 15-2, 15-5 పాయింట్స్ బీహార్ జట్టుపై గెలిచి ఛాంపియన్ గా నిలిచింది. మూడవ స్థానం ఢిల్లీ చేజిక్కించుకుంది. విజేతలకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ యలమంచిలి రవి బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తి రాజు, సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పరిశీలకులు గౌతమ్, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జి.ఎస్తేర్ రాణి, పోటీల కార్యనిర్వహణ కార్యదర్శి రమేష్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా U19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి రవికాంత టోర్నమెంటుని విజయవంతంగా నిర్వహించారు.















# స్కూల్ గేమ్స్ అండర్ - 19 బాలికల జాతీయ వాలీబాల్

## టోర్నమెంట్ విజేత తమిళనాడు బాలికల జట్టు



విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (SGFAP), స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా అండర్-19 యూనిట్ ఆధ్వర్యంలో అండర్-19 బాలికల 68వ స్కూల్ గేమ్స్ జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ ఐదు రోజుల పాటు జరిగింది. ఈ టోర్నీలో 25 జట్లు పాల్గొన్నాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ జట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోటీలను విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రారంభించారు. శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు పోటీలను తిలకించారు. ఈ పోటీల్లో తమిళనాడు బాలికలు కర్ణాటక జట్టుపై విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచారు. తృతీయ స్థానానికి జరిగిన పోటీలో హర్యానా కేరళ పై గెలుపొందింది. విజేతలకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు,రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి భానుమూర్తి రాజు, వాలీ బాల్ అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఏ వి రమణారావు, శాప్ మాజీ చైర్మన్ పి అంకమ్మ చౌదరి,సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ సి హెచ్ వెంకటేశ్వర్లు,రాష్ట్ర స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి కె వి రాధాకృష్ణ,జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి. రవికాంత పాల్గొన్నారు.









విద్యాశాఖాధికారులతో జాతీయ హ్యాండ్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన ఏపీ బాలుర జట్టు

సమగ్ర శిక్షా అధికారులతో జాతీయ హ్యాండ్ బాల్ ఏపీ బాలికల జట్టు






# బాలికా విద్య భద్రతకు భరోసా

## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు



**బా**లికల ఆరోగ్యం పరిరక్షిస్తూ, భద్రత కల్పించి, విద్యావంతులుగా తీర్చిదిద్ది బంగారు భవిష్యత్తుకి బాటలు వేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే లక్ష్యంగా 2004లో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా కేజీబీవీ (కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు)లు ఆరంభించింది.

సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 53తో మొదలై ప్రస్తుతం 352 కేజీబీవీలకు చేరుకున్నాయి. ఈ విద్యాలయాల ద్వారా 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదివే బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు భోజన, వసతి సౌకర్యాలు, భద్రత కల్పిస్తున్నారు. దాదాపు 80 వేలకు పైగా విద్యార్థినులు చదువుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికల కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ కేజీబీవీలు ఏర్పాటు చేశారు.

### కేజీబీవీల లక్ష్యాలు

* నిరుపేద బాలికలకు రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా నాణ్యమైన విద్యను అందించడం.
* బాలికల విద్యాభ్యాసం కొనసాగేలా చూడటం
* చదువులో బాలికల భాగస్వామ్యం పెంచేందుకు కృషి
* ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికలు చేరేలా ప్రోత్సహించడం

### విద్యార్థినులకు మెనూ

* ఉదయం 7 గంటలకు రాగిజావ లేదా పాలు
* 8.30 కు అల్పాహారం
* 10.30 కు చిక్కీ
* మధ్యాహ్నం 12.30 కు భోజనం
* సాయంత్రం 4 గంటలకు స్నాక్స్
* రాత్రి 6.30కు భోజనం



### విద్యావికాసానికి తీసుకుంటున్న చర్యలు

- వినూత్న బోధనా పద్ధతులు.
- విద్యార్థుల సృజనకు పదునుపెట్టే వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ.
- సైన్స్ ల్యాబ్ ల ద్వారా ప్రయోగాలు.
- కనీసం వారానికి ఒకసారి వ్యక్తిగత కౌన్సెలింగ్ సెషన్.
- నెమ్మదిగా నేర్చుకునే (స్లో లెర్నర్) వారిపై ప్రత్యేక శ్రద్ధ.
- విద్యార్థులకు జీవిత నైపుణ్యాలు, వృత్తిపరమైన శిక్షణ.
- PTA సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహణ.
- ప్రతి విద్యార్థినికి డైట్ ఛార్జీ రూ. 1600.
- ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు, డిక్షనరీలు.
- డిజిటల్ తరగతుల ద్వారా బోధన.

### ఆరోగ్యం–భద్రత కోసం..

- ప్రతిరోజూ ఆరోగ్యకరమైన పౌష్టికాహారం
- బాలికల భద్రత కోసం వాచ్ ఉమన్ లు, సీసీ కెమెరాలు ఏర్పాటు
- ప్రతి కేజీబీవీలో అందుబాటులో ఒక ఏఎన్ఎం
- సెల్ఫ్ డిఫెన్స్, యోగా వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ
- డార్మిటరీ పూర్తిస్థాయి సౌకర్యాలతో కూడిన హాస్టల్ భవనాలు.
- బాలికలకు తగిన సంఖ్యలో టాయిలెట్లు, వాష్‌రూమ్‌లు

### ఒక బాలిక చదువుకుంటే...

* సమాన విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు
* లింగ సమానత్వాన్ని సాధించవచ్చు
* ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది
* శాస్త్రీయ, సాంస్కృతిక, సాంకేతిక విద్యలపై పట్టు లభిస్తుంది
* ఆర్థికంగా స్వతంత్రంగా తమ కాళ్లపై తాము నిలబడగలరు
* కుటుంబాల ఆరోగ్యానికి, శ్రేయస్సుకు తోడ్పడవచ్చు
* సంస్కారవంతమైన సమాజ ఏర్పాటుకు మార్గదర్శకులు అవుతారు
* విద్య,ఉపాధి అవకాశాలు మెరుగై దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం పెరుగుతుంది
* చదువుకున్న తల్లులు తమ పిల్లలకు విద్య విలువ అర్థం చేసుకునేలా చెప్పొచ్చు
* విద్యతో బాలికలకు ఆరోగ్య సంరక్షణ, శుభ్రత, పోషణపై అవగాహన కలుగుతుంది

### కేజీబీవీల్లో చేరడం ఎలా?

సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మార్చి – ఏప్రిల్ మధ్యలో పూర్తి వివరాలతో నోటిఫికేషన్ వేస్తారు. ఆన్ లైన్లో అప్లయ్ చేసుకోవాలి.

### బాలికల అర్హతలు ఏంటి?

- తల్లిదండ్రులు లేని పిల్లలు
- తల్లి లేదా తండ్రి లేని పిల్లలు
- దివ్యాంగులు
- నిరుపేద ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలు
- ఈబీసీలు

### కేజీబీవీ బాలికలు భళా..

ఆడపిల్లలను చదివించడం అంటే కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తును మెరుగుపరచడం అనే లక్ష్యంగా దిశగా సాగుతోంది ఆంధ్రప్రదేశ్.రాష్ట్రంలో కేజీబీవీల్లో చదివిన ఎంతోమంది విద్యార్థినులు టీచర్, డాక్టర్, సాఫ్ట్ వేర్, పోలీస్, గ్రూప్ 2 ఆఫీసర్ పోస్టులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు.





కవర్ స్టోరి

# 'దివ్య'మైన లక్ష్యం..

# కస్తూరి తిలకం

## కేజీబీవీలో చదువు.. కొలువు



### కెమిస్ట్రీ టీచర్ **చింత దివ్య** విజయగాథ

"సాదాసీదా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె తన చిరకాల లక్ష్యం – "టీచర్ అవ్వాలి" అనే సంకల్పంతో, ఎదురైన ప్రతి అవరోధాన్ని అధిగమించింది. ఆత్మవిశ్వాసం ఆయుధంగా చేసుకుంది. ఏ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో చదువుకుందో అక్కడే కెమిస్ట్రీ టీచర్ గా చేరింది. విజయనగరం జిల్లా, తెర్లాం మండలంలోని చిన్నయ్యపేట గ్రామానికి చెందిన చింత దివ్య జీవితం విద్యార్థి లోకానికి స్ఫూర్తిగా నిలుస్తోంది."












## సంకల్పమే బలం

దివ్య తల్లిదండ్రులు చింత పార్వతి, వెంకటరమణ. వ్యవసాయమే జీవనాధారంగా తమ పిల్లలను చదివించారు. పెద్దమ్మాయిని డిగ్రీ వరకూ చదివించారు. రెండో అమ్మాయి దివ్య, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు సొంతూరిలోనే ప్రభుత్వ పాఠశాలలో చదివింది. తర్వాత తెర్లాం మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆరో తరగతిలో చేరారు.

## కాంతిదీపం కేజీబీవీ

తన బాల్యంలోని సమస్యలు, కష్టాలే దివ్యలో పట్టుదలను పెంచాయి. ఇవి అధిగమించాలంటే విద్యనే శక్తిమంతమైన మార్గమని విశ్వసించింది. ఎప్పటికప్పుడు తాను నేర్చుకుంటూనే మిగతా విద్యార్థులకు నేర్పించాలనే ఆశయంతో ముందుకు సాగింది. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు తెర్లాం కస్తూర్బా గాంధీబాలికా విద్యాలయంలో (కేజీబీవీ) చదువుకున్నారు. కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రోత్సాహం, ఉత్తమమైన బోధన, భోజన, వసతి సదుపాయాలు దివ్యలో నూతన ఆశలను రేకెత్తించాయి. 8.7 గ్రేడ్ పాయింట్స్‌తో పదో తరగతిని పూర్తి చేసి, పాలకొండ సత్యసాయి కాలేజీలో ఉచితంగా చేరి 943 మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. ఎమ్.ఆర్. అటానమస్ కాలేజీలో డిగ్రీ, గాయత్రి కాలేజీ (విజయనగరం గొట్లాం)లో బీఈడీ పూర్తిచేశారు.



## తన గూటికి చేరిన దివ్య

తన చదువుకు బాటలు వేసిన కేజీబీవీలోనే మళ్లీ ఉపాధ్యాయురాలిగా చేరడం విశేషం. 'చిన్నప్పుడు తెర్లాం కేజీబీవీ విద్యనందిస్తే.. ప్రస్తుతం విజయనగరం కేజీబీవీ ఉద్యోగాన్నిచ్చింది' అంటారు దివ్య. కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలిగా 23 నవంబర్, 2024 న నియమితురాలయ్యారు. తాను చదివిన కాలంలో ఉన్న తెలుగు మాధ్యమం స్థానంలో ఇప్పుడు ఆంగ్ల మాధ్యమం అమలవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రతి విద్యార్థికీ కెరీర్ గైడెన్స్ అందించాలి అంటున్నారు దివ్య టీచర్.

## విద్య – జీవిత మార్పు శక్తి


“విద్యార్థిగా ఉన్నప్పుడు ఎదురైన కష్టాలు గుర్తుంచుకుంటాను. ఆ అనుభవాలు నాకు విద్యార్థుల్ని అర్థం చేసుకునే అవకాశం ఇస్తాయి” అని 'మనబడి'తో తన మనోభావాల్ని పంచుకున్నారు దివ్య. “ప్రతీ విద్యార్థి తన విద్య ద్వారా సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగాలి” అని ఆకాంక్షిస్తోంది దివ్య.

## ఒక విద్యార్థి స్ఫూర్తి కథ

కేజీబీవీ పాఠశాలలో చదివిన ఒక చిన్న గ్రామానికి చెందిన సాధారణ యువతి, అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఎదగడం అనేది కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు. అది కేజీబీవీల ప్రాముఖ్యతను, విద్యా శక్తిని నిరూపించేది. చింత దివ్య జీవిత కథ ప్రతీ విద్యార్థికి స్ఫూర్తి.

**– గణేశ్ బెహరా**
పీఆర్వో, సమగ్ర శిక్షా





## చిన్నారులం



చిన్నారులం చిన్నారులం
చిట్టి పొట్టి చిన్నారులం
ఆటపాటలాడు చిన్నారులం
చిలిపి పనుల బుజ్జాయిలం

బుజ్జి బుజ్జి బుగ్గల చిన్నారులం
చిలక పలుకుల చిన్నారులం
అందమైన చిన్న పిల్లలం
కోకిల పాటల పాపాయిలం

వెలుగులు చిందే దివ్వెలం
తప్పులు ఎరుగని వాళ్ళం
కల్లాకపటం తెలియని వాళ్ళం
అర్థాలు తెలియని అమాయకులం

కులమతాలెరుగని వాళ్ళం
ధనిక పేద తెలియని వాళ్ళం
అందరం కలిసి ఆటలాడతాం
ఏదనుకుంటే అది సాధిస్తాం




*– **యన్.మతీన,** 10వ తరగతి,*
*ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ)*
*కర్నూలు*



## అత్యాశకు ఫలితం (కథ)




ఒక గ్రామంలో రంగయ్య అనే యువకుడు ఉండేవాడు. అతడు మంచివాడే కానీ, ప్రతి వస్తువు నాకే కావాలని కోరుకునేవాడు. రంగయ్య దగ్గర కొన్ని ఆవులు ఉండేవి. అతను వాటిని అడవికి తీసుకెళ్లి, మేపేవాడు. ఆవుల మెడలో గంటలు కట్టేవాడు, దీని ద్వారా ఒకవేళ ఆవులు తప్పిపోయినా అతను వాటిని సులువుగా కనిపెట్టేవాడు. ఆవులు గడ్డి మేసేలోగా, అతను కట్టెలు కొట్టుకునే వాడు. ఆ ఆవుల మందలో ఒక బలిష్టమైన, మంచి ఆవు ఉండేది. ఆ ఆవు అంటే అతనికి చాలా ఇష్టం. అతను అన్ని ఆవులకి చిన్న గంటలు కట్టేవాడు కానీ, తనకు నచ్చిన ఆ ఆవుకి మాత్రం పెద్ద గంట కట్టేవాడు. ఒకసారి అడవి గుండా వెళ్తున్న బాటసారి ఒకడు రంగయ్యకు ఇష్టమైన ఆ ఆవును దొంగిలించాలనుకున్నాడు. మెడలో గంట ఉండడం గమనించాడు. ఆవు మెడలో గంట ఉంటే తను ఆ ఆవును దొంగిలించడం సాధ్యపడదు అని తెలుసుకున్నాడు. ఆలోచించి ఆ బాటసారి ఆవు మెడలో ఉన్న గంటను తనకు వంద రూపాయిలకు అమ్మమని రంగయ్యని అడిగాడు. రంగయ్య మనసులో భలే బేరం దొరికింది అనుకున్నాడు. వీడెవడో 50 రూపాయలు విలువ చేసే గంటని 100 రూపాయిలు అడుగుతున్నాడు అని అనుకున్నాడు తన మనసులో. సరే అనుకొని ఆ గంటను ఆ బాటసారికి అమ్మేశాడు. ఆ తరువాత రోజు ఆ బాటసారి రంగయ్యకు తెలియకుండా ఆవుని దొంగిలించాడు. రంగయ్య ఆవులన్ని ఇంటికి పట్టుకుని వెళ్తున్నప్పుడు తనకి ఇష్టమైన ఆవుని ఎవరో దొంగలించారని గమనించాడు. బాగా ఆలోచించగా ఇది తన స్వయంకృత అపరాధమే అని అతనికి తెలిసింది. వంద రూపాయిలు కక్కుర్తి పడి 500 రూపాయిలు విలువ చేసే ఆవును పోగొట్టుకున్నానని తెలుసుకున్నాడు. ఆ రోజు నుంచి రంగయ్య అత్యాశకు పోకుండా ఉన్నదానితో సంతృప్తి చెందడం తెలుసుకున్నాడు.



*నీతి: అత్యాశకు పోకుండా, ఉన్నదాంట్లోనే సంతృప్తి చెందడం నేర్చుకోవాలి.*

*– **బెందాళం సిద్ధార్థ్**, 9వ తరగతి , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేట, కవిటి, శ్రీకాకుళం జిల్లా*



## I can

Give me a chance,
I can build everything
I can win anything
I can clear the society's fence.

Put on me some trust
Whatever it may be, just I think to reach
In a society, I can change the sarcasm speech.
I can heal the pain as much as the deepest.

Just think about myself,
How much I can do?
I can defeat difficulties too.
As much as possible, I can build
myself.

*- R. Haritha, 10th,*
*APMS Tamada*
*Srikakulam, Andhra Pradesh.*

## మా పాఠశాల గణిత బాల మేధావి


ఈ విద్యార్థి పేరు మహమ్మద్ కైఫ్. చౌలూరు ఉన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. కైఫ్ గొప్పతనమేమిటంటే గణితంలోని చతుర్విధ ప్రక్రియలు(+,−,×,÷) ఎంత పెద్ద సంఖ్యతోనైనా అలవోకగా చేయగలడు. ఉదాహరణకు 428265÷143, 7232952×521 ఇవి కొన్ని. అలాగే వీటిని సరిచూడడం కూడా చేయగలడు. అలాగే కాప్రేకర్ కాన్స్టెంట్ గురించి చక్కగా వివరించగలడు. గణితంలో చెప్పే అన్ని విషయాలు చాలా త్వరగా చక్కగా అర్థం చేసుకోగలడు. 3,4 తరగతుల పిల్లలకు టీచర్ కం టే ముందుగానే వర్క్ బుక్ లోని అన్ని విషయాలు రాసి సిద్ధం ఉంటాడు. తోటి విద్యార్థులకు గణితంలో ఎలాంటి సందేహం వచ్చినా ముందుగా ఈ చిన్నోడిని వెంటపడి అనుమానం నివృత్తి చేసుకుంటారు. కైఫ్ చక్కగా బొమ్మలు కూడా గీయగలడు. కైఫ్ నిజంగా మా పాఠశాల బాలమేధావి.

*– **జి. వెంకటేశ్వర ప్రసాద్**, గణిత ఉపాధ్యాయులు,*
*జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చౌలూరు, హిందూపూర్ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా*








## బొమ్మ గీశానోచ్!




***ఎస్. భవ్య*** *10వ తరగతి*
*జెడ్. పి. హై స్కూల్ ప్లస్ (బాలికలు) కార్వేటినగర్ చిత్తూరు జిల్లా*



***సీహెచ్. రాజ్‌కుమార్,*** *మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,*
*కేశవదాసుపాలెం, తూర్పుగోదావరి జిల్లా.*




***యం. కీర్తన,*** *5వ తరగతి, మున్సిపల్ పెద్ద మార్కెట్ ఏరియా స్కూల్, కాకినాడ*





***వి. కీర్తన,*** *10వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,*
*వల్లూరుపాలెం, తోట్లవల్లూరు మండలం, కృష్ణా జిల్లా*

## రంగులు వేయండి



## చుక్కలు కలపండి



## మీకు తెలుసా ?

1. యునైటెడ్ కింగ్‌డమ్ కరెన్సీ ఏది?

**- పౌండ్ స్టెర్లింగ్**

2. టెలిఫోన్‌ను ఎవరు కనుగొన్నారు?

**- అలెగ్జాండర్ గ్రాహం బెల్**

3. ప్రపంచంలోనే అతి పొడవైన నది ఏది?

**- నైలు నది**

4. ఏ మూలకం '$O_2$' అనే రసాయన చిహ్నాన్ని కలిగి ఉంది?

**- ఆక్సిజన్**

5. నోబెల్ బహుమతిని గెలుచుకున్న మొదటి మహిళ ఎవరు?

**- మేరీ క్యూరీ**

6. ప్రపంచంలో అతిపెద్ద ఎడారి ఏది?

**- సహారా ఎడారి**

7. ఉదయించే సూర్యుని భూమి అని ఏ దేశాన్ని పిలుస్తారు?

**- జపాన్**

8. భూభాగం పరంగా అతి చిన్న ఖండం ఏది?

**- ఆస్ట్రేలియా**

9. అంతరిక్షంలోకి పంపబడిన మొదటి కృత్రిమ ఉపగ్రహం పేరు ఏమిటి?

**- స్పుత్నిక్ 1**

10. భారతదేశ ఉక్కు మనిషి అని ఎవరు పిలుస్తారు?

**- సర్దార్ వల్లభాయ్ పటేల్**

## కనుక్కోండి చూద్దాం...

హాయ్ ఫ్రెండ్స్.. ఇదిగో...
ఈ జూలో చాలా ప్రాణులు ఉన్నాయి.
చెల్లా చెదురుగా తిరుగుతున్నాయ్. వాటిని కనుక్కోండి.
(క్లూ కోసం పక్కనే లిస్ట్ కూడా ఉంది.)
సౌజన్యం: *www.rd.com*

### Zoo

All the words are hidden vertically, horizontally or diagonally—in both directions. The letters that remain unused form a sentence from left to right.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Z | K | A | N | W | O | O | T | S | K | O | A | L | A | K |
| O | R | S | S | O | I | R | A | R | E | A | G | R | O | E |
| T | A | I | T | N | O | L | A | L | L | I | R | O | G | L |
| T | P | A | E | P | A | B | D | A | T | P | L | S | L | I |
| E | B | A | I | C | E | K | A | E | T | O | R | T | E | D |
| R | L | C | A | X | B | U | E | B | B | T | T | O | H | O |
| K | A | N | G | A | R | O | O | S | B | E | A | R | S | C |
| L | E | I | N | O | I | L | R | R | M | A | E | K | I | O |
| H | I | P | P | O | P | O | T | A | M | U | S | S | N | R |
| L | G | O | A | S | T | N | A | L | P | L | I | S | T | C |
| L | T | H | C | I | R | T | S | O | O | K | E | E | U | P |
| A | A | N | S | I | M | A | L | H | S | I | F | O | S | A |
| M | S | I | J | A | G | U | A | R | T | H | B | R | R | C |
| A | V | E | A | T | E | W | N | E | D | A | W | I | E | I |
| T | H | E | X | T | K | I | N | C | R | L | T | K | D | R |
| I | O | N | S | M | U | I | R | A | U | Q | A | L | I | F |
| A | E | U | Q | A | C | A | M | F | E | A | S | E | P | A |
| N | D | S | O | U | N | L | E | R | R | I | U | Q | S | D |

FISH
GORILLA
HAWK
HIPPOPOTAMUS
JAGUAR
KANGAROO
KOALA
LION
LLAMA
LOOK
MACAQUE
MARABOU
OSTRICH
OTTER
PARK
PLANTS
SEAL
SNAKES
SPIDERS
SQUIRREL
STORK
TROPICAL
VISITORS
WILDEBEEST

AFRICA
APES
AQUARIUM
ASIA
BABOON
BAT
BEARS
CROCODILE
ELK

# మన బడి (బాల గేయం)



ఇది మన బడి
చదువుల గుడి
వెళదాం వడి వడి
నేర్చుకుందాం తెలివిడి
ఆడుకుందాం కలివిడి
భవితకు బాట మన బడి
ఇది ఆటపాటల అమ్మ ఒడి
రండోయ్, రారండోయ్
పలకా, బలపం చేపట్టి
నడవండోయ్, నడవండోయ్,
ముమ్ముందుకు నడుము కట్టి.

– **ఇసికేల ఉదయ కుమార్,** *టీచర్,*
*ఎన్. చిక్కేపల్లి, అనంతపురం జిల్లా.*

# బడే మెతుకు...బతుకు..




ఇప్పుడు
బడిని మోస్తున్నది
బలం లేని పల్లెలే...

ఏ ఊరిలో నైనా
సర్కారీ చదువుకు
చమీకిలద్దుతున్నది పేద పిల్లలే.

ఈ నిజం అబద్దం
కానంతవరకు
బడికి ఋణపడే బాధ్యత కీలకం.

విద్యార్థి జీవితాలకు
వేతన జీవులకి
మూలం బడి పచ్చదనమే

అందుకే
ఊరి కన్నా వెనుకున్నా
బడిని ముందుండి
నడిపిస్తుంది పల్లెలే

– **చందలూరి నారాయణరావు,**
*టీచర్, జెడ్పీ హెచ్ఎస్, ధర్మవరం, బాపట్ల జిల్లా,*
*9704437247*

(పిల్లల కథ)

# గాలిపటం

"డాడీ! నాకు అందరికన్నా పెద్ద గాలిపటం కావాలి!

ముఖ్యంగా ఆ రవి కన్నా పెద్ద గాలిపటం..." అన్నాడు అవినాష్.

"అలాగే బాబూ... నీకు చాలా పెద్ద కైట్ తీసుకొస్తాను సరేనా"

కొడుక్కి మాటిచ్చాడు ప్రసాద రావు.

ఆయన పెద్ద బిజినెస్ మేన్. అవినాష్ ఒక్కగానొక్క సంతానం. ఇద్దరిదీ ఒకటే స్వభావం. బిజినెస్ లో తాను ఎవరికీ అందనంత ఎత్తులో ఉండాలనుకుంటాడు. అవినాష్ కు అదే లక్షణం వచ్చింది. అన్నింటిలోనూ తానే గొప్ప అనిపించుకోవాలనే ఆరాటం. ఆటపాటల్లో ఆట వస్తువుల్లో కూడా ప్రక్కవాళ్ళతో ఎప్పుడూ పోటీపడుతూ ఉంటాడు. అన్ని విషయాల్లో కొడుకు అలా పోటీ పడడం చూసి, వారించకపోగా మరింత ప్రోత్సహించేవాడు ప్రసాదరావు.

అవినాష్ వాళ్లున్న వీధి చివర్లో రవి వాళ్ళ ఇల్లు ఉంది. రవి అన్నింటిలో చురుగ్గా ఉండేవాడు. వాళ్ళది మధ్యతరగతి కుటుంబం. రవి, అవినాష్ ఇద్దరూ ఐదో తరగతే. రవి ప్రభుత్వ బడిలో చదువుతుంటే, వాళ్ళ స్థాయికి తగినట్లే అవినాష్ ఒక పెద్ద కార్పొరేట్ స్కూల్ లో చదువుతున్నాడు.

వారంలో ఆరు రోజులూ రవి, అవినాష్ లకు బడిలోనే గడిచిపోతుంది. ఆదివారం మాత్రం దగ్గర్లోని గ్రౌండులో గాలిపటాలు ఎగరేస్తుంటారు. అక్కడ చాలామంది గాలిపటాలు ఎగరవేయడానికి వస్తారు. ఆదివారం రోజు ఆ మైదానమంతా పిల్లల కేరింతలతో సందడిగా ఉంటుంది.

ఒక రోజు రవి స్వయంగా పెద్ద గాలిపటాన్ని తయారు చేసుకుని వచ్చి ఎగరవేయసాగాడు. అంతే... అవినాష్ కి ఎక్కడ లేని ఉక్రోషం వచ్చేసింది. రవి చేతిలో అవమానం ఎదురైనట్టు భావించాడు. చేతిలోని గాలిపటాన్ని అక్కడే విసిరికొట్టి విసవిసా వెళ్ళిపోయాడు. వచ్చే ఆదివారం వరకూ ఎదురుచూస్తున్నాడు. తన కన్నా పెద్ద గాలిపటాన్ని ఎగరవేసేటప్పుడు రవి ముఖం వాడిపోవడం చూడాలని ఉవ్విళ్లూరుతున్నాడు.

*(మిగతా తరువాత పేజీలో)*



అవినాష్ ఎదురుచూసిన రోజు రానేవచ్చింది. సాయంత్రం కాగానే వాళ్ళ నాన్న తెచ్చిన అందమైన అతిపెద్ద గాలిపటం తీసుకొని మైదానానికి బయలుదేరాడు. తన గాలిపటాన్ని అందరూ మెచ్చుకుంటుంటే అవినాష్ కి గర్వంగా అనిపించింది. రవి ఎప్పటిలాగే నవ్వుతూ తన గాలిపటంతో వచ్చాడు.

గ్రౌండ్ అంతా కోలాహలంగా ఉంది. రవి ఒక మూల నుండి నెమ్మదిగా తన గాలిపటాన్ని ఎగరేయడం మొదలుపెట్టాడు. రవిని చూసి అవినాష్ హేళనగా నవ్వాడు.

"నా గాలిపటం చూశావా... నీ కన్నా ఎంతో పెద్దది!" అన్నాడు. "అవును అవినాష్. చాలా బాగుంది" అన్నాడు రవి. ముఖంలో నవ్వు అలాగే ఉంది. అవినాష్ కొద్దిగా నిరుత్సాహపడ్డాడు. తన గాలిపటాన్ని చూసి, రవి అసూయ పడతాడేమో అనుకున్నాడు. ఎప్పటిలాగానే నవ్వుతూ సమాధానం ఇచ్చేసరికి అవినాష్ దెబ్బతిన్నాడు.

రవిని ఎలాగైనా ఏడిపించాలని అవినాష్ ఎత్తుగడ. మాంజా రాసిన తన గాలిపటం దారంతో రవి గాలిపటాన్ని తెగ్గొట్టాడు. ఆకాశంలోంచి ఒక్కసారిగా నేలపైకి వాలిపోయింది రవి గాలిపటం. అవినాష్ సంతోషానికి పట్టపగ్గాల్లేవు.

రవి మాత్రం మామూలుగానే ఉన్నాడు. అదే చెరగని చిరునవ్వుతో దూరంగా పడిపోయిన గాలి పటాన్ని తీసుకొని ఇంటికి వెళ్లిపోయాడు. అవినాష్ కి తలకొట్టేసినట్లనిపించింది. రవి బాధ పడుతుంటే చూడాలనే తన ఆశ తీర లేదు సరికదా, రవి ముఖంలో కొంచెం కూడా కోపం లేదు. ఆ రాత్రి... జరిగింది అంతా తన తండ్రితో చెప్పాడు అవినాష్. ప్రసాదరావుకి కూడా ఆశ్చర్యం అనిపించినా అవినాష్ ముందు బయటపడడం ఇష్టంలేక, "సరే, ఈ సండే నేను కూడా నీతో వస్తాను. గాలిపటం ఎగరేద్దాం!" అన్నాడు.

తర్వాత ఆదివారం తండ్రీ కొడుకులు ఇద్దరూ గ్రౌండుకు వచ్చారు. రవి తన గాలిపటానికి మరమ్మత్తు చేసి తెచ్చుకున్నాడు.

ప్రసాదరావు గ్రౌండ్ లో ఉన్న ఒక సిమెంట్ బెంచీ మీద కూర్చున్నాడు. రవిని చూస్తే అతనికి జాలేసింది. ఒక చిన్న చిరుగుల నిక్కర్, బనియన్ మీద ఉన్నాడు రవి. చేతిలో పాత న్యూస్ పేపర్స్ తో చేసిన గాలిపటం. ఒక వైపు అవినాష్ షోకేస్ లో బొమ్మలా అందంగా ఉన్నాడు. దుమ్ము కొట్టుకుపోయి ఉన్నా సరే, రవి ముఖం మీద అతుక్కుపోయిన చిరునవ్వు ఎలా అన్నది ప్రసాదరావుకు మింగుడు పడలేదు.

ఎగరేసేవాళ్ళ పంతం తమకు పట్టనట్లు గాలిపటాలు ఆకాశంలో ఎగురుతున్నాయి. దట్టంగా మంజా రాసిన దారంతో అవినాష్ గాలిపటం రవి గాలిపటాన్ని సులువుగా కోసేసింది. వాళ్ళ నాన్నవైపు గర్వంగా చూసాడు అవినాష్. ఆయన అవినాష్‌వైపు చూడడం లేదు. రవి ముఖం కేసి చూస్తున్నాడు. రవి ముఖంలో మార్పులేదు. అదే చిరునవ్వు. ఇంత చిన్న పిల్లాడికి ఇంత నిబ్బరం ఎలా అబ్బిందబ్బా... సాలోచనగా తల విదిలించాడు.

అదనంగా తెచ్చుకున్న దారంతో రవి మళ్లీ గాలిపటాన్ని ఎగరవేయడం మొదలుపెట్టాడు. రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ రవి గాలిపటాన్ని తెగ్గొట్టాడు అవినాష్. ఈసారైనా రవి బాధపడతాడు అని ఆశించిన తండ్రీ కొడుకులు ఇద్దరికీ నిరాశే ఎదురైంది.

ప్రసాదరావు బెంచీ మీద నుండి లేచి, రవి దగ్గరికి వెళ్ళాడు. చిక్కులుపడ్డ దారాన్ని విప్పుతున్నాడు రవి. ఆయన్ని చూసి, "హలో అంకుల్ ..." అన్నాడు నవ్వుతూ.

" నీ గాలిపటం కోసేస్తే, నీకు కోపం రాలేదా?" అడిగాడు.

"కోపం ఎందుకు అంకుల్. ఆటలో ఇవన్నీ మామూలే కదా. ఆటను ఆటలా చూడాలి. పోటీలా చూడకూడదు. అప్పుడే కదా ఆనందం" అన్నాడు రవి.


చెంప మీద ఎవరో ఛెళ్లున కొట్టినట్లు అనిపించింది.

"అన్నిసార్లు నీ గాలిపటాన్ని కోసేసినా, నువ్వుతూనే ఉన్నావ్. బాధ అనిపించలేదా!?" ఆరా తీశాడు.

"కోసేసింది ఎవరు అంకుల్... నా ఫ్రెండే కదా! వేరొకరు ఎవరో అయితే బాధపడేవాడినేమో. స్నేహితుల మధ్య సరదా ఉంటుంది కానీ, బాధ ఉండదుగా..." నవ్వుతూ బదులిచ్చాడు రవి.

రవి ముఖంలో చెరగని చిరునవ్వుకి కారణం ఉన్నతమైన అతడి ఆలోచనలే అని ప్రసాదరావుకి అర్థమైంది. అనుకోకుండా ఆకాశం వైపు చూసాడు. ఎవరికీ అందనంత ఎత్తున రవి గాలిపటం ఎగురు తున్నట్టు అనిపించింది! రవి భుజం మీద చిన్నగా తట్టి అవినాష్ వైపు నవ్వుతూ అడుగేసాడు. ఆ తర్వాత ఎప్పుడూ ఆ మైదానంలో గాలిపటాలు తెగిపడలేదు!

– **సాంబమూర్తి లండ,** పాఠశాల సహాయకులు,
జెడ్పీ హెచ్ఎస్, వజ్రపుకొత్తూరు,
శ్రీకాకుళం జిల్లా, 9642732008



స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి..
మన బడి మ్యాగజైన్ చదువుకోండి.

# మేలు చేసిన దయాగుణం

అంగరాజ్యాన్ని ఇంద్రవర్మ అనే రాజు పాలించేవాడు. ఆ రాజ్యం చుట్టూ దట్టమైన అడవులు ఉన్నాయి. ఆ అడవులపై ఆధారపడి రాజ్యంలో ఎందరో ప్రజలు జీవిస్తున్నారు. అడవుల నుంచి కాయలు, పండ్లు, పువ్వులు, తేనె, మూలికలు వంటి ఉత్పత్తులు ఎన్నో ఆ రాజ్యాన్ని ఆదుకుంటున్నాయి.

ఒక సందర్భంలో ఆ అడవులకు ఒక అధికారిని నియమించాల్సిన బాధ్యత ఇంద్రవర్మకు వచ్చి పడింది. అయితే



అడవుల బాగోగులు చూసుకోవడానికి అతని దగ్గర ఉన్న అధికారులు ఎవరూ సుముఖత చూపలేదు. దాంతో రాజు కొత్త వ్యక్తిని అటవీ అధికారిగా నియమించాలనుకున్నాడు. మంత్రితో మాట్లాడగా అతను ఒక సలహా ఇచ్చాడు. చెట్లు,అడవి జంతువుల పట్ల దయార్ద్ర హృదయం కలిగినవాడైతే బాగుంటుందని చెప్పాడు.

దాంతో రాజు ఒక ప్రకటన చేశాడు. ఎవరైతే ఒక నెల రోజులపాటు మంచి పనులు చేస్తారో వారిని అటవీ అధికారిగా నియమిస్తానని దండోరా వేయించాడు. ప్రకటన విన్న తర్వాత ప్రజలు ఎవరికి తోచిన పనులు వారు చేయడం మొదలుపెట్టారు.

ఆ రాజ్యంలో రంగంపేట అనే సంస్థానం ఉంది. దాని జమీందారు దుర్మతుడు. అతడు బాగా ఉన్నవాడే అయినా ఇంకా సంపాదించాలని అత్యాశ ఉంది. అతనికి కుమతి అనే ఒక కొడుకు ఉన్నాడు. రాజు ప్రకటన విన్న జమీందారు అందరితో పాటే కొడుకును కూడా ఏదో ఒక మంచి పని చేయమని ప్రోత్సహించాడు. కొడుకు అటవీ అధికారి అయితే అడవుల్లోని ఉత్పత్తులను తన సొంతానికి వాడుకోవచ్చని దురాశ.

తండ్రి మాట ప్రకారం కుమతి తన ప్రణాళికను కొనసాగించాడు. తన సంస్థానంలో ప్రముఖులకు విందు భోజనాలు పెట్టించాడు. ఎండాకాలం కాకపోయినా చలివేంద్రాలు ఏర్పాటు చేశాడు. అవసరం ఉన్నా లేకపోయినా రహదారులు వేయించాడు. అందరికంటే తామే ఎక్కువ ఖర్చు పెట్టాం కాబట్టి తమకే ఆ ఉద్యోగం దక్కుతుందని తండ్రీకొడుకులు భావించారు.

అందరూ ఎదురు చూసే రోజు రానే వచ్చింది. ఉద్యోగం ఎవరికి వచ్చిందో వెల్లడించాల్సిన రోజు వచ్చింది. రాజు నిండు సభలో హర్షుడు అనే ఒక నిరుపేద యువకుడు ఈ ఉద్యోగానికి ఎంపిక అయినట్లు ప్రకటించాడు. దాంతో సభలో ఉన్న జమీందారు మొహం మాడ్చుకుని "అదేమిటి మహారాజా! ఎందరో ఎన్నో మంచి పనులు చేశారు. మేము కూడా ఎంతో ఖర్చు పెట్టి చాలా పనులు చేశాం. అసలు ఆ యువకుడు మీరు చెప్పినట్లు చేసిన దాఖలాలు కూడా లేవు. అయినా అతన్ని ఎందుకు ఉద్యోగానికి ఎంపిక చేశారు?" అని అడిగాడు

దానికి రాజు ఇలా వివరణ ఇచ్చాడు. "హర్షుడి తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. చిన్ననాటి నుంచి తల్లికి చేదోడు వాదోడుగా ఉండడమే కాదు యువకుడైనప్పటి నుంచి కూలి పనులకు వెళుతూ ఇంటిని నడుపుతున్నాడు. అదేం పెద్ద విశేషం కాకపోయినా అతడు చిన్నప్పటినుంచి జంతువులను, పక్షులను తన పెరడులో పెంచుతున్నాడు. అంతేకాదు ఎండాకాలం వస్తే రహదారుల్లో మనుషులకే కాదు జంతువులు, పక్షుల కోసం కూడా తాగడానికి నీరు ఏర్పాటు చేస్తాడు. వైద్యం కూడా నేర్చుకుని గాయపడ్డ జంతువులు, పక్షులకు వైద్యం చేస్తాడు. తనది పూరిపాక అయినా ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో పూల మొక్కలను, చెట్లను పెంచుతున్నాడు. ఆ చెట్లపై అనేక పక్షులు సేద తీరుతున్నాయి. నాకు ముందు ఇతని గురించి తెలియదు. ప్రకటన చేసిన తర్వాత ఎవరు మంచి పనులు చేశారో తెలుసుకునేందుకు వేగులను నియమించాను. వారి ద్వారా నాకు హర్షుడి గురించి తెలిసింది. అటవీ అధికారిగా ఉండే వాడికి ప్రకృతి పట్ల బాధ్యత ఉండాలి. అది సహజంగానే ఇతనిలో ఉంది. ఇప్పుడు చెప్పండి! నేను తీసుకున్న నిర్ణయం సరైనదా? కాదా?" అని రాజు అనడంతో సభలోని వారంతా రాజు నిర్ణయం సరైనదే అంటూ హర్షధ్వానాలు చేశారు.జమిందారు కూడా తన తప్పు తెలుసుకుని మనస్ఫూర్తిగా హర్షుడిని అభినందించాడు.

**– పల్లా వెంకట రామారావు**
*S.A.తెలుగు,Z.P.హైస్కూల్,*
*దువ్వూరు, వైయస్సార్ కడప జిల్లా, 9949043019*





# నడవడిక

## డిటెక్టివ్ కథ

**సా**ర్, నా పెన్సిల్ కనిపించడం లేదు..

నా సంచిలోని పెన్ను ఎవరో తీసేశారు సార్...

అయ్యో! నా బుక్ పోయింది...

మాస్టార్ని చుట్టుముట్టారు మూడవ తరగతి పిల్లలు.

పిల్లలూ.. మీ వస్తువులు మీకు త్వరలోనే అందేలా చూస్తాను, నాకు



కొంచెం సమయం ఇవ్వండి అని మాస్టారు వారిని సముదాయించారు.

ఈ విషయాన్ని ఐదో తరగతి చదువుతున్న హిమజ కు చెప్పి సమస్యకు పరిష్కారం కనుగొనాలని మాస్టారు అనుకున్నారు. అదే రోజు మధ్యాహ్న భోజనం తర్వాత డిటెక్టివ్ గా పేరు తెచ్చుకున్న హిమజను పిలిచి విషయాన్ని తెలియజేసారు.

మరుసటి రోజు ఉదయం బ్రేక్ సమయంలో హిమజ మూడవ తరగతి గదిలో ఎవరు ఇంకా ఉన్నారు, బయటకు ఎవరెవరు వెళ్తున్నారు అనేది గమనించసాగింది. దాదాపు ఇరవై మందికి గాను ముగ్గురు మాత్రమే బయటకు వెళ్ళలేదు. రెండవ పూట బ్రేక్ లో ఇంకా రెండో రోజు ఉదయం బ్రేక్ సమయంలో కూడా ఇలానే గమనించింది.

ఈ రెండు రోజుల్లో బ్రేక్ సమయంలో ఆటస్థలంలో ఉన్నవారు, బయట ఆడుతున్నవారు, తరగతి గదిలో ఉన్నవారు, టాయిలెట్స్ కు వెళ్లినవారి సమాచారం సేకరించింది హిమజ.

ఇద్దరిపై అనుమానం ఉన్నట్లు మాస్టారితో చెప్పింది. ఆ ఇద్దరి ప్రవర్తన గురించి మాస్టారితో చర్చించింది. రవి ఇలా చేయకపోవచ్చు అనుకుని చివరిగా ఈ పని రాజు చేసి ఉండవచ్చని నిర్ధారణకు వచ్చారు.

ఒక్కసారి రాజుతో వ్యక్తిగతంగా మాట్లాడారు. తాను తప్పు చేశానని ఒప్పుకున్నాడు రాజు. అయితే తనకు ఒక్క అవకాశం ఇవ్వమని ఇకపై అలాంటి పని చేయనని బతిమాలాడు. ఇతర పిల్లలకు ఈ విషయం చెప్పొద్దు అని వేడుకున్నాడు.

తప్పు చేసినది ఎవరో తెలిసినా, రాజు తప్పు చేసిన విషయం మిగిలిన పిల్లలకు తెలియకుండా ఉండాలంటే ఏమి చేయాలో హిమజ మాస్టారుకి ఓ ఉపాయం చెప్పింది. రాజు తరువాతి రోజు ఏమి చేయాలో మాస్టారు రాజుకి వివరించారు.

మరుసటి రోజు తరగతిగదిలో మాస్టారు "పిల్లలూ.. మీ వస్తువులు మీకు త్వరలోనే అందేలా చూస్తాను అన్నాను కదా! మీరంతా ఒక్కసారి కళ్ళు మూసుకొండి అని అన్నారు.

పిల్లలంతా కళ్ళు తెరిచేసరికి ఇదివరకు కనిపించకుండా పోయిన అన్ని వస్తువులు తరగతిగదిలో మధ్యలో ప్రత్యక్షమయ్యాయి. తమ వస్తువులు చూసుకుని పిల్లలంతా ఎంతో సంతోషించారు.

మాస్టారికి, హిమజకు రాజు తన కళ్లతోనే ధన్యవాదాలు తెలుపుకుంటూ అప్పటి నుండి మంచి నడవడికను అలవర్చుకున్నాడు.

– **డా. ఎస్.వి. లక్ష్మణరావు** సిఎంఓ కన్సల్టెంట్
సమగ్ర శిక్షా



టీచర్లూ / పిల్లలూ,
మీ బడిలో కానీ, చుట్టు పక్కల కానీ ఈ కథలోని హిమజ లాంటి పిల్లలు మీ దృష్టికి వచ్చినా, అలాగే తరగతి గదిలో ఎన్నో సమస్యలు మీరు ఎదుర్కొన్నా ఆ సమస్యలకు గల కారణాలను తెలుసుకోవడంతో పాటు వాటిని ఎలా పరిష్కరించవచ్చో వివరిస్తూ మాకు పంపించండి. బాగున్నవి ప్రచురిస్తాం. బహుమతి కూడా అందిస్తాం.
వాట్సాప్ నంబర్: 87126 52298
manabadimagazine@gmail.com

ఇన్ హౌస్

## విద్యార్థులకు సృజనాత్మకంగా బోధించాలి

విజయవాడలో ఆంధ్రాలయోలా కాలేజీ ఎస్-జె సెంటర్లో కేజీబీవీ టీచర్లకు జరిగిన ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ సంచాలకులు విజయరామరాజు. వి IAS., ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరో శిక్షణ కేంద్రం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి హీల్ ప్యారడైజ్ సెంటర్లో జరిగింది. రెండు కేంద్రాల్లో దాదాపు 252 మంది కేజీబీవీ టీచర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి మంచి భావితరాన్ని అందించే బాధ్యత ఉపాధ్యాయ లోకం చేతిలోనే ఉందన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికి వెళ్ళేముందు బోధన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నిత్య విద్యార్థిలా రోజూ కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు.

**అమ్మలాంటి లాలన అందించాలి: ఎస్పీడీ బి.శ్రీనివాసరావు IAS.**

సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు IAS., మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కేజీబీవీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నామని, కేజీబీవీ విద్యార్థులు అన్ని రంగాల్లో దూసుకెళ్లేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కేజీబీవీ విద్యార్థులకు డైట్ ఛార్జీలు ప్రతి విద్యార్థికి నెలకు రూ.1400 నుండి 1600లకు పెంచామన్నారు. కౌమారదశలో బాలికలకు అమ్మలా లాలించి వారి కష్ట సుఖాలను తెలుసుకోవాలని వాటిని పరిష్కార దిశగా ప్రయత్నించాలని కోరారు.



## పుస్తకాల కిటికీలు తెరిస్తే.. అవి జ్ఞాన ద్వారాలు తెరుస్తాయి

పుస్తకాల కిటికీలు తెరిస్తే అవి జ్ఞాన ప్రపంచపు ద్వారాలు తెరుస్తాయని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు IAS అన్నారు.

35వ విజయవాడ పుస్తక మహోత్సవం సందర్భంగా చెరుకూరి రామోజీరావు వేదికపై జరిగిన నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురణల ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన 'పలహారాల చెట్టు', 'పుత్తడి బొమ్మతో స్నేహం', 'మాట్లాడే గడియారం', 'చిక్కుముడి' అనే అనువాద బాల సాహిత్య రచనలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''మున్సిపల్ స్కూల్లో విద్యాభ్యాసం చేసిన నేను ఈ రోజు ఒక సివిల్ సర్వీసెస్ అధికారిగా మీ ముందు ఉన్నాను అంటే.. దానికి పుస్తకాలు, పబ్లిక్ లైబ్రరీలు కారణం అయ్యాయి''అని పేర్కొన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ అమూల్యమైన ప్రచురణలు సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో నేషనల్ బుక్ ట్రస్టు కార్యవర్గ సభ్యులు జి. వల్లీశ్వర్, నేషనల్ బుక్ ట్రస్ట్ దక్షిణ ప్రాంత బాధ్యులు పత్తిపాక మోహన్, బాలసాహితీవేత్తలు ముంజులూరి కృష్ణకుమారి, అమరవాది నీరజ పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షులు కె. లక్ష్మయ్య పాల్గొన్నారు.



## వీర్ గాథ విజేతలకు బహుమతి ప్రదానం

జాతీయ స్థాయి వీర్ గాథ పోటీల నమోదులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మూడో స్థానం దక్కింది. దేశం కోసం పోరాడి, ప్రాణత్యాగం చేసిన శౌర్య పురస్కార గ్రహీతల జీవన విధానం, లక్ష్యాలు, దేశం పట్ల వారికి ఉన్న అనురక్తి నేటితరానికి తెలియచేసి విద్యార్థుల్లో దేశభక్తిని, త్యాగ భావాన్ని పెంపొందించడమే ముఖ్యలక్ష్యంగా రక్షణ మంత్రిత్వ శాఖ మరియు విద్యా మంత్రిత్వ శాఖ, సమగ్ర శిక్షా సంయుక్తంగా నిర్వహించిన ప్రాజెక్టు వీర్ గాథ 4.0 ఈ సందర్భంగా పెయింటింగ్, డ్రాయింగ్, వ్యాస రచన వంటి పోటీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 2.5 లక్షలకు పైగా పాఠశాలల నుండి 1.76 కోట్లకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీర్ గాథ 4.0 విద్యార్థుల నమోదులో దేశంలోనే మూడో స్థానంలో ఆంధ్ర ప్రదేశ్ నిలిచింది. సూపర్-100 విజేతలకు రూ. 10,000 నగదు పురస్కారం, ఒక పతకం మరియు ఒక సర్టిఫికెట్‌ను అందజేశారు. రక్షణశాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సత్కరించారు.





# చిట్టీ చేతులు.. చక్కని రాతలు

## హ్యాండ్ రైటింగ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని కొల్లి నందిని ప్రతిభ






**చి**ట్టీ చేతులతో చక్కని రాతలు నేర్చింది.. అందమైన ఆ రాతని మరికొందరు చిన్నారులకు నేర్పుతోంది

పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు మున్సిపాలిటీ గాడివీధిలో కె.ఎ.ఎం హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న కొల్లి నందిని. వెన్నెల ఆకాశంపై చుక్కల్లా మెరిసే ముత్యాల్లాంటి అక్షరాలు రాయగలిగే నేర్పు ఎలా సాధించిందో నందిని మాటల్లో..


``నేను నోట్సులు రాసినా, వర్క్ చేసినా చేతిరాత బాగుంటుందని టీచర్లు మెచ్చుకునేవారు. మా నాన్న కూడా ప్రోత్సహించేవారు. 2022లో ఏడవ తరగతి చదువుతున్నప్పుడు హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్ ఆన్లైన్లో నిర్వహించిన చేతిరాత పోటీలలో పాల్గొని ఉమ్మడి విజయనగరం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాను. ఆగస్టు 6వ తేదీన విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అప్పటి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నాను. జనవరి 27న నేషనల్ హ్యాండ్ రైటింగ్ డే సందర్భంగా నిర్వహించిన జాతీయస్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాను. 2023 ఏప్రిల్ 4న గుంటూరులో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి. లక్ష్మణరెడ్డి గారి చేతుల మీదుగా బహుమతి అందుకున్నాను.

### ఇటు రైటింగ్...అటు ట్రైనింగ్

మనం నేర్చుకున్న విద్య నలుగురికి పంచకపోతే వృథా... అని చెప్పిన మా నాన్నకొల్లి రామకృష్ణ ప్రోత్సాహంతో సాలూరు పట్టణంలో ఉన్న నవజీవన్ నిరుపేద పిల్లల ఆశ్రమంలో విద్యార్థులకు చేతిరాత శిక్షణా తరగతులను ఉచితంగా నిర్వహించాను. 9వ తరగతిలో ఓవైపు శ్రద్ధగా చదువుతూనే మరోవైపు నేను నేర్చుకున్న కాలిగ్రఫీ (అందమైన చేతిరాత) తోటి విద్యార్థులు కూడా రావాలని మా పాఠశాల అయిన కె ఏ ఎన్ ఎం హైస్కూల్ గాడివీధిలోను, సమీపంలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్లో ఖాళీ సమయాల్లో పిల్లలకు చేతిరాతపై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించాను. నా ప్రతిభ గురించి తెలుసుకుని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభినందించారు. నా లాగే అందమైన చేతిరాత మీకూ రావాలంటే ప్రాక్టీస్ చేయండి..రాస్తూనే ఉండండి.. ఫ్రెండ్స్..



Abdul kalam was born on 15th october 1931 at Dhanushkodi, Rameswaram, Tamil Nadu. In his childhood he worked as a newspaper vendor. His science teacher inspired him. He completed Aeronautical engineering from IIT madras 1960. He held the position of Chief advisor and Chairman of IGMDP, DRDO, ISRO. He invited "Low cost coronary stent and rugged tablet computer in 1998. He was unamiously elected the president of India (2002-2007). He was known as peoples president.



రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గారి అభినందనలు పొందుతూ..




జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు గారి ప్రశంసలు పొందుతూ

# ఇంటర్ విద్యార్థులకూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనవరి 4వ తేదీన **డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం** ప్రారంభించిన మానవ వనరుల శాఖామాత్యులు **నారా లోకేష్.**










# విద్యా వికాస కేంద్రాలు.. ప్రభుత్వ విద్యాలయాలు













విద్య
విజ్ఞానం
ఆటలు
వినోదం
ఆత్మరక్షణ

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur